# బివేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్


వాడ్రేవు వీరలక్ష్మీదేవి



ఎక్కడా ఏ చప్పుడూ వినిపించడం లేదు. ఇల్లంతా నిర్మానుష్యంగా ఉంది. అందుకే ఇప్పటి దాకా మెలకువ రాలేదు. 'ప్రతి ఆదివారమూ ఉన్నదే ఇది. రావ్ మా ఇద్దరి బద్ధకాన్ని పెంచి పోషిస్తాడు' - అనుకుంటూ రగ్గు లోంచి తల బయటపెట్టి బద్ధకంగా కళ్ళు విప్పేను.

ఎదురుగా గోడ మీద నారింజ రంగులో పెయింటింగ్ లాంటి ముగ్గు, డిజైన్, అసలు దాన్ని ఏమి అనాలో తెలీడం లేదు. ఏమిటి ఇది -? నాకు తెలీకుండా ఈ తూర్పు మూల బెడ్‌రూంలోకి ఎవరు - తెచ్చిపెట్టేరు దీన్ని- ?

ఒక్క రెండు నిమిషాలకి బుర్ర




3-

పనిచేసింది. "వేయి సువర్ణ ప్రభాతాల మేరకు ధనవంతుణ్ణి" - కవిగారు భుజం మీద తట్టి గుర్తు చేసారు. ఈ ఉదయం నేను ఇలా ధనవంతురాలిని అయేన నమాట.



వెంటలేటర్ డిజైన్‌ని గదిలో ఎదురుగా తెల్లని గోడమీద నారింజ రంగులో అద్దిన ఆ 'ఆదిత్య హృదయాన్ని' కన్నులలోంచి హృదయం దాకా తనివి తీరా ఆస్వాది స్తున్నాను.

ఇంతలో పక్కనున్న రాజా అన్నాడు.

"అమ్మా! దేవుడు మన గదిగోడమీద పెట్టిన రంగుల ముగ్గులా ఉంది కదూ! అది."

అరె! పక్కకి తిరిగి చూసేను.

వాడూ నాలాగే రగ్గులోంచి తల బయట పెట్టి ఆవింతనే ఆస్వాదిస్తున్నట్టున్నాడు. అది సరే. ఎంత పొయిటిక్‌గా చెప్తున్నాడు ఈ పదేళ్ల వెధవ. ఇలాంటప్పుడే ముద్దొస్తాడు వాడు.

అందరి తల్లుల లాగ అస్తమానమూ ముద్దుచెయ్యనని వాడికి కోపం. ముద్దు పెట్టుకుని చెప్పేను. మనం ఈ రోజు ఇంత ధన వంతులమయేం. అలాగని ఆ కవిగారు వ్రాసారు కదా మరి అని. మా మాటలు వినిపించినట్టున్నాయి. రావ్ బెడ్‌రూం తలుపు తీసుకుని లోపలికి వచ్చేడు.

"చప్పుడు కూడా చెయ్యకుండా తలుపులు వేసేసి మమ్మల్ని ఇలా ఎంత సేపు పడుకోబెడదామని - ? మరీ ఇద్దరం ఎందుకూ పనికి రాకుండా పోతున్నాం" అని విసుక్కున్నాను నేను.

"బయట బాగా చలిగా ఉంది ఈ రోజయినా కాసేపు పడుకోండి" అని బయటికి వెళ్లిపోయాడు తను. రావ్ ఉదయం అయిదింటికే లేచి పోతాడు. హైమకూడా లేస్తుంది. లేచి చదువు ్తుంది. చిన్న చప్పుడయినా వినిపించ కుండా పనులు చేసుకుంటారు వాళ్లు. ఎవరి పనులు వాళ్లు చేసేసు కుంటారు. ఒకరి కోసం ఒకరి పనులు ఆగవు. రావ్, నేనూ కలిసి ప్రయత్నం చేసి ఇటువంటి వాతావరణం తెచ్చేం ఇంట్లోకి. ఇంట్లో అందరికీ అన్ని పనులూ వచ్చు. ఎవరి వీలును బట్టి వాళ్లం చేసేస్తాం.

"రాజా! లే! లే! ఈ రోజు మనం త్వరగా తయారయి ఒక చోటికి వెళ్లాలి." అన్నాను.

"ఈ రోజు నేను ఎక్కడికీ రానమ్మా. గాలి పటం తయారు చెయ్యడం నేర్చుకుని, ఎగరేసుకోవాలి." అన్నాడు రాజా "చదువూ - హోం వర్కూ ఏమీ లేవా?"

"నిన్న స్కూల్లోనే అయిపోయింది హోం వర్కు అంతాను" "ఒకే! నీకు చదవేస్తే ఉన్నమతి పోయిందిరా! హోంలో చేసే వర్క్ హోం వర్క్"అంటూ నేను లేచి, వాడినీ లేపి గదంతా సర్ది ఇవతల పడ్డాం. కాఫీడికాషన్‌తీసి ఉంది. కాఫీ కలిపి తీసుకొచ్చి రావ్‌కి ఒక కప్పు ఇచ్చాను. ఎక్సర్‌సైజ్‌లు పూర్తి చేసుకుని పేపరు చదువుకుంటున్నాడు తను.

"ఈ రోజు భోజనాలు అయాక నేను ఒక చోటికి వెళ్లాలి" అన్నాను.

"ఎక్కడికి"-? అన్నాడు పేపర్‌లోంచే. "ఆ పేపర్ పక్కన పెడితే మంచి సంగతులు చెప్తాను" అన్నాను. "మనం చెప్పేవి వినదు కానీ- తను చెప్పేవి మాత్రం వినాలం టుంది"అంటూ అక్కడికి చేరాడు రాజా, నా వెనక చేరి కొంగుతో మొహం తుడిచే సుకుంటూ.

"నీకు డిసిప్లిన్ లేదురా! టవల్‌తో తుడుచుకోమని ఎన్ని సార్లు చెప్పేను-!" అంటున్నాడు రావ్

వాడు కొంగులోంచే "అమ్మ కొంగు బలే మెత్తగా ఉంటుంది నాన్న. కావలస్తే నువ్వూ తుడుచుకుని చూడు" అంటు న్నాడు.

ఈ కొంటె పిల్లవాడిని ఎవరు పెంచ గలరు-? అందుకే మేం పెంచడం లేదు. వాడే పెరుగుతున్నాడు.

"అవును నేను చెప్పేమాటలు వినడం ఇష్టం లేకపోతే వినకు" అన్నాను వాడితో.

"నువు ఎలాగయినా కొన్ని అబద్ధాలు కలిపి చెప్తావమ్మ ఏ విషయానికయినా. అందుకే వినకూడదనుకుంటాను గానీ- మళ్లీ వినబుద్ధి వేస్తుంది -" అన్నాడు.

"నేను అబద్ధాలేమీ కలపను. అలా వినాలనిపించేలా మాట్లాడగలను నేను అంతే-" అని "బికాజ్ అయామ్ ఎ్రైటర్ ' అన్నాను నవ్వుతూ వాడి బుగ్గ పట్టుకుని. "సంగతేమిటో చెప్పు" అన్నాడు రావ్.

రావ్‌కి నేను రాజాని సరిగా పెంచడం లేదేమోనని చిన్న సందేహం. సందేహమెం

దుకు-? హైమ ఎలా పెరిగింది-? రాజా కూడా అలాగే పెరుగుతాడు. నేనూ, రావ్ సక్రమంగా, పద్ధతిగా ఉంటే చాలు. ఆ వాతావరణమే వాళ్లని తీర్చిదిద్దుతుంది. "మన ఇల్లు ప్రయోగశాల చేస్తున్నావ్" అన్నాడు రావ్ నవ్వుతూ "ఇంతకీ ఏమిటి సంగతి -?"అన్నాడు.

నిన్నటి సంగతి అంతా గుర్తుకొచ్చింది. మామూలుగా ఎలా చెప్తాను-? నా పద్ధతిలోనే చెప్పేను.

మేడ మెట్లు ఎక్కుతూ, నా నరనరా ల్లోనూ వ్యాపించి నన్ను వివశను చేస్తున్న ఆ పాటను మళ్ళీ మళ్ళీ పాడు కుంటు న్నాను "రమ్మంటే చాలు గానీ - రాజ్యాలు వదిలి రానా!

నీ చిన్న నవ్వుకోసం - నీ - చిన్న - నవ్వు- కోసం

స్వర్గాలే గడిచి రానా!"

ఎంత అద్భుతంగా పాడేడు ఆకుర్ర వాడు. పాడుతుంటే వివశను అయిపో యాను. పక్కన ఆ అమ్మాయి ఒక వైపు గిటార్ మీద 'లీడ్' చేస్తే మరోవైపు కాషియోతో రిథమ్ ఇస్తూ ఆ పాటకు తళుకు అద్దింది.

వాళ్లు ఇద్దరూ కలిసి ఆ అయిదు నిమిషాలూ అక్లాస్ రూంలో వసంతాన్ని ఆవిర్భవింప చేసారు. నేను లతలాగ పరవశంతో చిగిర్చేను. ఇప్పుడు పువ్వులాగ మకరంద భారంతో మత్తెక్కుతున్నాను ఆ సంగీత జ్ఞాపకానికి.

యూత్‌ఫెస్టివల్‌కి స్టూడెంట్స్‌ని తయారు చేస్తున్నాను. పాటలు డాన్సులు ఒకటే హడావిడి. రెండు వేలమంది లోంచి పదిమందిని ఏరేను. అంతే ఎప్పుడూ ఇన్ని కోట్ల మందిలో కళాకారులు ఎంత తక్కువ మంది-?

ఆ పది మందితో ఈ పది రోజులుగా సాధన. రోజులు సంగీత మాధుర్యంతో పరవశించి పోతున్నాయి. ఇంటికి వెళ్లినా ఇవే కూనిరాగాలు క్లాసులో పాఠం చెప్తున్న ఆ రాగాల మాధుర్యపు చైతన్యమే శరీరమంతా.

రెండు రోజులలో పిల్లలతో కలిసి నేను ఆయువజన ఉత్సవానికి, ఆ వసంతానికి అతిధినై వెళ్తున్నాను.

నలభయిలలో పడ్డ నేను ఈ పిల్లల సాన్నిహిత్యంలో యౌవనోత్సాహాన్ని మరిచిపోలేను. వాళ్లలో ఒకటి అయిపోతూ ఉంటాను. ఒక్కొక్క సారి ఆచైతన్యంలోంచి నా అనుభవజ్ఞానం నన్ను విడదీసి అలో చింపజేస్తూ ఉంటుంది.

అదే ఆలోచన వచ్చింది ఇప్పుడూను. ఎంత బావుంది ఈ పాట. ఆ ప్రేమికుడు హృదయంవిప్పి ఆ ప్రేయసి పాదాల మీదకి విసిరేసాడు. రాజ్యాలు వదిలి, స్వర్గాలు గడిచిరానా? అంటున్నాడు. ఎంత ఎమోషనల్. ఆ ప్రేయసి గర్విష్టి కాదా ఈ మాటలు విని.

కానీ ఈ పురుషుడే - ఆ ప్రేమపీ తన ఇంట్లోకి వస్తే, 'తనది' అయితే ఎంత తేలికగా, ఎంత లోకువగా, హేయంగా నీచంగా మార్చెయ్యగలడు-?

ఇదంతా కవుల మోసం కాదా? పాట ఆగిపోయింది నా నోట్లోంచి. గుండె బరు వెక్కిపోయింది ఈ ఆలోచన రాగానే.

నిజం..!! ఎందుకీ పాటలు!? కవులు ఎందుకు ఇలా మోసగిస్తారు - ఆడవాళ్లని-?

ఆకాశంలో నిర్మించిన హర్మ్యాలలోంచి బురదలోకి ఈడ్చిన రోజు ఈ స్త్రీల హృదయాలలోని డిజప్పాయింట్ మెంట్, దుఃఖం, వేదన ఎలాగ భరించ గలగడం -?... మెట్ల మధ్యలో ఆగిపోయాను. పైనించి ఇద్దరు అమ్మాయిలు కిందకి వస్తూ నన్ను చూసి విష్ చేసి ఆగారు. నా మొహంలో ఏదో వివర్ణత కనిపించిన ట్లుంది వాళ్లకి. "వాట్ మేడమ్! కెన్ వుయ్ హెల్ప్‌యూ" అని అడిగేరు వాళ్లు.

నా మొహం అంత ఎక్స్‌ప్రెసివ్‌గా ఉంటుందా-? ప్రయత్నించి నవ్వేను. "వద్దమ్మా! మీరు వెళ్లి పొండి"- అని నెమ్మదిగా ఒక్కొక్క మెట్టే ఎక్కడం మొదలు పెట్టేను.

పైన శైలజ, సుమ కనిపించేరు. "ఏ మయ్యేరు మేడం? మీకోసమే వెయిట్ చేస్తున్నాం" అంటూ

"ఏమిటి సంగతి" -? అన్నాను.

"సుమ బహుశా మనతో రాలేదు మేడం- ఆ సంగతి చెబ్దామని వచ్చాం"

"ఏమ్మా! ఏమయింది-?" అన్నాను. ఆ అమ్మాయి సందేహిస్తోంది చెప్పడానికి. ఏదో దాస్తోందనిపించింది.

"ఏమిటి-? ఏమయింది-? ఇంట్లో వప్పుకోలేదా? నేను కూడా ఉంటానని చెప్పలేదా?"

"కాదు మేడం....." అంటూ ఆగింది

"ఊ! ఏమిటి చెప్పు" అన్నాను ఆమె ముఖం వైపే చూస్తూ ఆ అమ్మాయి ముఖం నాకు ఎందుకో ఆత్మీయంగా అనిపిస్తుంది. మొదటి రోజు క్లాస్‌లో అంతమంది లోనూ చూసినప్పుడే అనుకున్నాను. కారణం తెలియదు కానీ ఎప్పటి నుంచో పరిచయం ఉన్నట్టులుంటుంది.

శైలజ అంది "వాళ్ల అమ్మగారికి పీరియడ్స్ టైం మేడం ఆవిడ బయట కూచుంటారు. సుమ ఇంట్లో లేకపోతే కుదరదు-" అని

ఎంత చిన్న అభ్యంతరం-?

సుమ శాస్త్రీయ సంగీతం అద్భుతంగా పాడుతోంది- "తులసీ దళములతో సంతో షముగా పూజింతును" అని ఆ పిల్ల పాడుతూ ఉంటే ఆ అనుభూతి ప్రతి రోజూ నన్ను బలంగా తాకుతోంది. త్యాగరాజు పదాలలో పోసిన ప్రాణమంతా పలికించే ప్రయత్నం చేస్తోంది. ఈ పిల్లకి ఆ యూనివర్సిటీ పోటీలలో ఏదో ఒక బహుమతి వస్తుదనుకున్నానే. ఏమిటీ - ఈ అభ్యంతరం-?

"సుమా! నేనూ మీ ఇంటికి రావచ్చా?"

పిల్లలు ఇద్దరూ కంగారు పడ్డారు.

అదేమిటి మేడం, తప్పకుండా. మీరు వస్తానంటే మేమే వచ్చి తీసుకెళ్తాం" అన్నారు.

* * *

"అదీ నిన్నటి సంగతి. ఈ వేళ మధ్యాహ్నం సుమా వాళ్ల ఇంటికి వెళ్లి ముందు వాళ్ల అమ్మ తలకాయ తినాలని - నా ప్లాన్" అన్నాను.

"అమ్మ బ్రెయిన్ ఈటర్" అన్నాడు రాజా.

హైమ నా పక్కన వచ్చి కూర్చుంది. దాని సన్నిధి ఎంతో మృదువుగా ఉంటుంది. పూల మాలల మధ్య ఉన్నట్టు ఉంటుంది. దాని దగ్గర దాని అంతట అదే అలా వికసించింది.

"సుమ వాళ్ల ఇంట్లో అవసరం అయితే ఆ రెండు రోజులూ నేను వెళ్లి ఉంటానమ్మా. వాళ్ల అమ్మగారికి చెప్పి సుమని తీసుకువెళ్లు" అంది.

ఇందుకే హైమని పూలతో పోల్చడం.

"బావుంది. ఒకరిని మించి ఒకరు - లోకాన్ని ఉద్ధరించడానికి మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి ముందు." అంటూ రావ్ పేపర్ పక్కన పడేసి తన పనులలోకి వెళ్లిపోయాడు.

* * *

మధ్యాహ్నం రావ్ సుమ వాళ్ల ఇల్లు వెతికి, వెతికి నన్ను వాళ్ల ఇంటి దగ్గర దింపేడు. "నువు రాకు. నేను వచ్చేస్తాలే -" అని చెప్పి అతనిని పంపేసి నేను ఆ ఇంటి గేట్ తీసుకుని లోపలకి అడుగు పెట్టేను.


తలుపు దగ్గర నిలబడి కాలింగ్ బెల్ నొక్కేను. తలుపు తియ్యడానికి ఒక నిమిషం పట్టింది. ఆ నిమిషంలోనే అనిపించింది. ఎవరో ముక్కూ మొహం తెలియని వాళ్ల గుమ్మం ముందు నిలబడి సెలవు రోజు ఇలా గడుపు తున్నానని తెలిస్తే మా కొలీగ్స్ ఎంత నవ్వుతారూ? అని.

తలుపు తీసారు. ఎవరో కాదు. ముక్కూ, మొహం బాగా తెలిసినదే. కానీ శరీరం మాత్రం భారీగా ఉంది. పై నుంచి పాదాల దాకా చూసాను. జుట్టు దువ్వు కోకుండా ముడి. అస్తవ్యస్తంగా చీరకట్టు పాదాలు కనిపించేలా. పాదాలకి పచ్చగా పసుపు.

ఒక్క నిమిషం ఎవరూ? అని నిదానించి చూడబోయి నువ్వా! ఎంత ఆశ్చర్యం? అని నా రెండు చేతులూ పట్టుకుంది నా బాల్య నేస్తం ప్రభావతి.

ప్రభావతే. పద్ధెనిమిదేళ్ల క్రితం ప్రభావతి. ఇప్పుడు మళ్లీ - ఇంతకీ నేను వచ్చింది సుమ కోసం కదా? ఒకవేళ సుమ - ఈ ఇంట్లోనే - దీని కూతురా కొంపదీసి.

అన్నీ ఆశ్చర్యాలే. ఆశ్చర్యంతో, ఆనందంతో తలమునకలవుతూ లోపలకు అడుగు పెట్టాను. లోపలకు అడుగు పెట్టడమేమిటి - నన్ను రెండు చేతుల తోనూ కౌగిలించేసుకుంది.




ఎంతో ఆర్తితో ఉంది ఆ స్పర్శ. ఒక అభద్రత, భయం - వాటినుంచి తనను దగ్గిరికి తీసుకోమనేలాంటి దేదో ఆ కౌగిలి లోంచి నాకు స్ఫురించిన - భ్రాంతేమో!

గుమ్మంలోనే నాకు ఈ భ్రాంతు లేమిటి-? దాన్ని అలాగే భుజం చుట్టూ చెయ్యి వేసి దగ్గిరికి తీసుకుని లోపలకి నడిచాను. డ్రాయింగ్ రూంలో కూర్చో పెట్టింది.

"జయా! ఎలా వచ్చావు ఇక్కడికి-? నేను గుర్తు ఉన్నానా? ఎలా తెలిసింది ఇల్లు-?"

"ఉండు. అన్ని ప్రశ్నలకీ జవాబు చెప్తాను. నీ పిల్లలు ఎంత మంది-? ఏం చేస్తున్నారు-?" అన్నాను.

"ఉండు - పిలుస్తాను." అని "సుమా! రజనీ! అని పిలిచింది సుమ పుస్తకంతోనే వచ్చింది. వచ్చి నన్ను చూస్తూనే విష్ చేసింది. "అమ్మా! మా మేడం. ఈ రోజు వస్తారని చెప్పేను కదా" అంది.

"ఓహ్! అదా సంగతి. అరే! నా కూతురికి మేడమ్‌వా! ఎంత బావుందే నాకు ఇలాగ. ఎప్పుడూ ఇలాంటి ఊహ అయినా రాలేదు." అని "వీడు మా అబ్బాయి రజనీకాంత్. 9th చదువుతున్నాడు" అంది.

రాజా అయితే "హాయ్ ఆంటీ! మీరు మా అమ్మ ఫ్రెండా-? అయితే నాకూ ఫ్రెండే" అంటాడు.

ఈ రజనీ అంత దూరం నుంచీ నాకేసి సీరియస్‌గా చూసాడు. 'నమస్తే' అని లోపలికి వెళ్లిపోయాడు.

సుమా! జయే ఇది. ఎప్పుడూ చెప్పేవు కాదేమే! అయ్యో! రెండేళ్లనుంచి కాలేజీకి వెళ్తున్నావుకదా! అని. ఊఁ పో-పోయి చదువుకో - అని తరిమేసింది.

"సుమా! కాసిని మంచినీళ్లు తెచ్చి పెట్టు" అని అడిగి తాగేను కానీ ఆ పిల్లకి ఆ చిన్న విషయం కూడా తెలీలేదు. ప్రభా వతి అంటే వీణ, హిందీపాటలు, కవితలు, పువ్వులు అన్నింటి సమాహారం. తను వీణ వాయించగా కాలేజీ ఉత్సవాలలో నేను పాటలు పాడేదాన్ని. మల్లెపూలు పెట్టుకుని, మైమరచి, సాయంత్రాలు, పాత హిందీ పాటలు పాడుకుంటూ, హాస్టల్ గార్డెన్‌లో తిరిగే వాళ్లం.

ఆ జ్ఞాపకాలు మాట్లాడబోయాను. చాలా వరకూ మర్చిపోయింది కానీ నెమ్మదిగా గుర్తొచ్చాయి. నా గురించి అడిగింది.

"ఎంత అదృష్టవంతురాలివే! హాయిగా స్వతంత్రంగా బ్రతుకుతున్నావ్!" అంది.

"స్వతంత్రంగా బ్రతకడం అదృష్టమని అనిపిస్తోందా?" అన్నాను.

"కాదూ! మరి. నేను చూడు. అంతా పరాధీనతే. మొగుడూ, పిల్లలూ ఎవ్వరూ మాట వినరు. ఈ ఇంటి చాకిరీ కోసమే మిగిలేను." అంటూ "దా! పని చేసు కుంటూ కబుర్లు చెప్పుకుందాం" అంది.


"ఇప్పుడేం పని-? భోజనాలు అయి పోలేదా?" అన్నాను.

"లేదు. మా ఇంట్లో అన్నీ కొంచెం లేటే" అని "ఆయనకు అన్నీ వేడిగా ఉండాలి. చల్లారితే తినరు. అందుకని టైం చూసుకుని చేస్తాను." అంది.

వంట ఇంట్లోకి వెళ్లేం. రకరకాల వాసనలతో నిండి ఉంది వంటిల్లు. కోసిన ఉల్లిపాయ ముక్కల నించి, సింక్‌లో పడేసిన అంట్ల గిన్నెలదాకా కలగలిసి పోయిన వాసన.

డైనింగ్ టేబుల్ నిండా రకరకాల డబ్బాలు. చెయ్యి పెడితే అంటుకునేలా దుమ్ము. ఒక్క నిమిషం పరిశీలనగా చూస్తూ నిలబడ్డాను.

దానికి అర్థమయింది. "శుచి, శుభ్రత లు మర్చిపోయేనను కుంటున్నావా? లేదు. వదిలేసాను. ఈ వాతావరణం ఏమిటో ఒక గంట చూస్తే నీకే తెలుస్తుంది." అంది.




ఆయన ఉదయం తొమ్మిది లోపు భోజనం చేస్తాడట. ఉదయమే లేచి వేడి వేడిగా కూరలు, చారు, అన్నమూ వండాలి. మళ్లీ రెండు గంటలకి వచ్చి మళ్లీ తింటాడు. మళ్లీ అన్ని కొత్తగా, వేడిగా వండాలి. సాయంత్రం అయిదు దాటకుండా టిఫిన్. రాత్రి మళ్లీ తొమ్మిది గంటలకి అన్ని కొత్తగా వేడి వేడిగా వంట. ఏదీ నిమిషం ఆలస్యం కాకుండా, నోట్లో మాట నోట్లో ఉండగానే అందించెయ్యాలిట.

ఉదయానివి అన్ని పక్కకి తోసేసి మళ్లీ మొదలు పెట్టింది. నాతో మాట్లాడుతూనే ఉంది. నన్ను సాయం చెయ్యనివ్వలేదు. అతనికి, తనే చెయ్యాలిట. ఏవేవో చేస్తూనే ఉంది. కింద ఒలుకుతున్నాయి. అవి తుడిచి శుభ్రం చేసే టైం లేదు(ట). ఇంకా కొంచెం పని ఉందనగానే కాలింగ్ బెల్ మోగింది. సుమ వెళ్లి తలుపు తీసినట్టుంది.

"ఏం! నువు తీసేవు? మీ అమ్మ ఏం చేస్తోంది-?" అన్న మగ కంఠం వంటింట్లోకి వినిపించింది.

"మా మేడమ్ వచ్చేరు. అమ్మకి చిన్నప్పటి నుంచి కాలేజ్ దాకా ఫ్రెండ్‌ట' ' సుమ ఎప్పటిలా బెరుకు కంఠంతోనే జవాబు చెప్తోంది.

"ఊఁ! రజనీ ఏం చేస్తున్నాడు-?"

"రూంలో చదువుకుంటున్నాడు" అంది.

అతను వంటింటి వేపు రాలేదు. ప్రభ ఒకటే కంగారు పడుతోంది. వంట పూర్తి చెయ్యడానికి. నాతో కబుర్ల వల్ల ఆలస్యం అయిందన్నమాట.

అతను రెండోసారి పిలిచేలోపున అన్నీ కంచంలో సర్ది తీసికెళ్లి ఆ హాల్లోనే భోజనం పెట్టింది ఆ సర్దడంలో హడావిడిలో సాంబారు గిన్నెలోంచి చీర మీదకు తూలింది. గబగబా పమిట కొంగుతో అక్కడ తుడిచేసుకుంది.

"ఫ్రిజ్‌లో వాటర్ పెట్టలేదా" అంటు న్నాడు.

ఇంత చలిలో ఎవడయినా ఐస్ వాటర్ తాగుతాడా? నాకు బుర్ర పనిచెయ్యలేదు. అతి వేడిగా, అతి చల్లగా ఉండాలన్నమాట. 'సెన్స్'లు కాలిపోయి, మొద్దుబారిపోవు!?! చూడకుండానే, పరిచయమేనా లేకుండానే ఆ వాతావరణం అంతా రహస్యంగా నాకు ఆ వ్యక్తిని గురించి, అతని 'సెన్స్‌లెస్ నెస్' గురించి చెప్పేసింది.

* * *

భోజనం అయినట్టుంది. కనీసం అతనికి ఈ మేడమ్‌ని చూసే కుతూహల మేనా లేదా? అనుకున్నాను వంటింట్లో బంధించబడ్డ నేను. వాళ్ల ఇంట్లో పిలవకుండా అన్ని గదులలోకీ ఏం తిరుగుతాను-?

నెమ్మదిగా ఏదో చెప్తోంది. చెప్పి "జయా" అని పిలిచింది. చెయ్యి కడుక్కుని, భార్య అందించిన తువ్వాలుతో చెయ్యి తుడుచుకుంటూ "ఓహ్! మీరా!' ' అన్నాడు కళ్లు ఎగరేస్తూ నేను 'నమస్తే' అని అలా అన్నందుకు చిన్న బుచ్చుకుంటున్నాను. ఇంతలో "మా అమ్మాయిని జాగ్రత్తగా చదివించండి" అంటూ నిర్లక్ష్యంగా బెడ్ రూంలోకి పోయి తలుపులు వేసేసుకున్నాడు.

ఆ మాటల్లో పొగరు, లెక్కలేని తనం కొట్టొచ్చినట్టు కనిపించేయి. భార్య స్నేహితురాలిగా నాకు అతను ఇచ్చే గౌరవం అది. ఒకవేళ భార్య స్నేహితురాలు తనపై ఉద్యోగి అయితే ఏం చేస్తాడో-?

ప్రభావతి మొహంలో ఏ భావమూ లేదు - "పద భోజనం చేద్దాం" అంటి కంచం చుట్టూ పోసిన చెత్తంతా ఎత్తి లోప లికి తీసికెళ్తూ.

"నేను చేసే వచ్చేను. నువు చేద్దువుగాని పద." అన్నాను.

ఆ వండినవి అన్నీ మూతలు తీసేసి వదిలెయ్యడం వల్ల అవి వచ్చేసరికి చల్లారి పోయాయి. మూతలు పెట్టి, సర్దిపెట్టి, వెళ్లి భోజనం పెట్టేటంత టైం ఇవ్వలేదు అతను.

ఆ చల్లారిన వంటకాలు కంచంలో పెట్టుకుని ఏదో అటూ, ఇటూ కెలికి భోజనం అయింది అనిపించింది. భోజనం అయాక స్థిమితంగా కబుర్లు చెప్పుకోవచ్చు - అనుకున్నాను. కంచాలూ అవీ తీసేసి సింక్‌లో పారేసింది. అదంతా శ్రద్ధగా శుభ్రం చేసే పనిపెట్టుకోలేదు. పక్కనే గిన్నెలో నానబెట్టిన పప్పు తీసి కడగడం మొదలు పెట్టింది.

"కాసేపు అలా ఆ హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుందామే" అన్నాను.

"నువు చెప్తూ ఉండు. నేను ఈ పని చేసేస్తే అయిపోతుంది." అంది.

ఏం కబుర్లు వస్తాయి నాకు-? నలభయి ఏళ్లు దాటిన మనిషి భోజనం చేసి అరగంట అయినా విశ్రాంతి తీసుకోను అంటుంటే. అసలు టైం లేదు అంటుంటే. కడిగిన పప్పు రోట్లో వేసి రుబ్బడం మొదలు పెట్టింది. మిక్సీ ఎదురుగా కనిపిస్తోంది. ఆ మాటే అడిగేను.

"మిక్సీలో వేస్తే రుచి ఉండదు కదా! నీకు ఎక్సర్‌సైజ్ కూడాను-" అంటారు ఆయన." అంది.

నాకు ఒళ్లుమండింది. నేను రోజూ ఉదయం, సాయంత్రం ఇంట్లో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాను. కానీ ఇలా కాదు. ఇది ఎక్సర్‌సైజ్ కాదు చాకిరీ. క్రమబద్ధంగా,

శాస్త్రబద్ధంగా చేసేది ఎక్సర్‌సైజ్. అంత దద్దమ్మల్లా కనిపిస్తున్నామా! మేము-?

అదే అన్నాను.

"జయా! నాకు తెలీదూ! నాకూ అన్నీ తెలుసు" అంది.

టిఫిన్ తయారు చేస్తుండగా లేచి నట్టున్నాడు ధర్మప్రభువు. తన పని అంతా చకచకా చేసేసుకున్నాడు. రెడీ అయిపోయి టిఫిన్‌కి ఆర్డర్ చేసాడు.

ఇంకా అయిదేనా కాలేదు. మళ్లీ ప్రపంచంలో పడి ఉద్ధరించాలన్నమాట. లోపల నుంచి కసి తన్నుకు వచ్చింది నాకు. వేడివేడి టిఫిన్ ప్లేట్‌లో పెట్టి అందించింది. ఈ లోగా చేసే టిఫిన్ మధ్యలో ఆపేసి, టీ పెట్టి జాగ్రత్తగా మీగడ పాలతో మరగనిచ్చి మాంచి కప్పులో పోసి తీసికెళ్లి అందించింది.

అంతా అయేక వంటింట్లోకి తొంగి చూసి "నేను బయటికి వెళ్తున్నాను" అని "మీ ఫ్రెండ్‌కి కాస్త శుభ్రత నేర్పండి. ఈ వంట ఇంట్లో అడుగు పెట్టలేం-" అన్న మాటలు విసిరేసి వెళ్లిపోయాడు.

సమాధానం అతనికి అక్కర్లేదు. దాని అశుభ్రత. దాని ఫ్రెండ్‌నయిన నా బాధ్యత గుర్తు చేస్తే చాలు. చటుక్కున దాని మొహంకేసి చూసాను. ఇందాకటిలాగే ఏ భావమూ లేదు.

పిల్లలకి టిఫిన్ గదులలోకి అందించింది. వాళ్లు సెలవురోజు రోజంతా వాళ్ల గదుల్లోనే చదువుకుంటూ పడి ఉండాలన్న మాట. అంతే అయి ఉంటుంది బహుశా. అతను గట్టిగా ఒక్క మాటకూడా మాట్లాడ లేదు. అయినా ఇంటిని అంతగా తన బ...సంలో, తన అధీనంలో ఉంచాడన్నమాట. ఎంత సమర్థత-? ఎంత గొప్ప మగవాడు?

నాకూ టిఫిన్ పెట్టింది. నా కళ్ళ నీళ్లు తిరగడం ఒకటే మిగిలింది. నా మీద ప్రేమ కనుకనే అతిధి మర్యాదగా కాక తనతో సమానంగా చూస్తోందని. అందరి హడావిడులు అయ్యాకనే స్థిమితపడి నాకు పెట్టిందని. కానీ ఆ ఆడకూతురి కష్టం అంతగా చూసిన నాకు ఆ టిఫిన్ గొంతు దిగుతుందా?




ఏ ఆడదీ కష్టపడకుండా లభించే అన్నం ఏ ఇంట దొరుకుతుంది-? నాకు ఏదోగా ఉంది. అదేదీ మాటలలో పెట్టలేక "పద అలా పెరట్లోకి వెళ్దాం" అన్నాను.

దువ్వెన తీసుకు వచ్చింది "జడ వెయ్యవే. ఎన్ని ఏళ్లు అయిందో-" అంటూ. దాని పెద్ద జుట్టు దువ్వి నేనే జడ వేసేదాన్ని రోజూ. పరీక్షలలో కూడా విసుక్కుంటూనే ఆనందంగా వేసేదాన్ని.

కాలం మమ్మల్ని పెద్దగా మార్చినట్టు లేదు. జుట్టు విప్పి చిక్కు తియ్యడానికే టైం పట్టింది. కొంచెం కూడా ఊడలేదు. ఆ పెద్దజడ అలాగే వచ్చింది నేనే వేస్తే. ఆ జడ ప్రభావతి సెన్సిటివిటీకి గుర్తు. ఆ సెన్సిటివిటీ అలాగే ఉందా? ఎత్తుగా పొట్ట, వంపులన్నీ పూడిపోయి గుల్లబారిపోయిన శరీరం, ఈ చాకిరీకి చిహ్నాలుగా కనిపిస్తు న్నాయి. ఎప్పుడూ వంటింట్లో తిరిగి పాదాలు ఒరిసిపోతాయిట. అందుకని వైద్యంగా పాదాలకి ఆ పసుపు రాస్తుందట.

"ఏమిటే! ఈ జీవితం-?" అన్నాను.

"ఈ జీవితానికేం! దివ్యంగా ఉంది." అంటూ నవ్వింది.

"శరీరం పాడయిపోయింది. ఆలోచించ గులుగుతున్నావా? అనుభూతి ఏమయినా మిగిలిందా?" అన్నాను.

"ఉండుండు. గురువుగారి మాటలు గుర్తు వస్తున్నాయి. శరీరం పోయిందే. నిజమే. కానీ ఆలోచన పోలేదు. అనుభూతీ పోలేదు కానీ బలవంతాన పోగొట్టు కున్నాను." అంది.

"గురువుగారు గుర్తున్నారన్నమాట. అయినా ఇలాగే ఉన్నావు" అన్నాను.

"గుర్తున్నారు. కానీ ఆలోచన ముఖ్యం అని అదొక్కటే మిగుల్చుకున్నాను. నాకు తెలుసు. ఈ వంట ఇంట్లో, ఈ అమర్చి పెట్టడంలో, ఈ హడావిడిలో నాకు తెలీకుండా లోపలి నిదానం పోయింది. ఒక అర్థం లేని కంగారు, ఆందోళన వచ్చేయి. శుభ్రత నేనే వదిలేసాను. శుభ్రత సాగాలంటే ఓపిక సరిపోదు. అందరూ ఏమంటారో తెలుసా నన్ను-? నాకు శుచి శుభ్రతలు లేవని." అంది.

హాస్టల్‌లో శుచి శుభ్రతలు మాకు అందరికీ నేర్పింది తనే. ఆ మాట గుర్తు చేసాను.

"అవును గానీ, ఈ పూట పూటా తిండి అమర్చి పెట్టడంలో శుభ్రత సాగదు. మొదట్లో చాలా ప్రయత్నించాను కానీ నా వల్ల కాలేదు. ఇన్ని ఏళ్ల తర్వాత ఆలోచించు కుంటే నా లోపలి నిదానమూ, స్థిమితమూ కూడా ఏనాడో పోయేయని అర్థం అవు తోంది. తెల్లవారి లేచింది మొదలు ఈ వంట గురించిన కంగారే బుర్రనిండా."

"నెమ్మదిగా మార్చలేకపోయావా?" అన్నాను.

అప్పుడు అంది అది "ఇందులో నా తప్పుకూడా ఉంది. మొదట్లో ఆయన మీద ఇష్టంతో, రకరకాలు చేసి పెట్టేదాన్ని. ఆయన చాలా ఇష్టంగా తిని మెచ్చుకునే వారు. ఆ మెప్పుకోసం మొదలు పెట్టి ఇలా అయేను. అయితే నా పాటలు, నా సంగీతం ఏవీ ఆయన మెప్పుపొందలేదు కాబట్టి వాటి కోసం టైం ఖర్చు పెట్టలేక పోయాను. చివరికి ఆ జీవితం పోయి ఈ జీవితం మిగిలింది." అంది.

"ఒక పూట మానేస్తే ఏం చేస్తాడే?" అన్నాను.

"ఏమీ చెయ్యరు. ఇంకా ఆ రోజు అంతా ఏమీ తినరు. బయటా తినరు.